# సౌందర్య పిపాస

నేను మంచి సంస్కారంగల కుటుంబంలో పుట్టాను. ఇలా చెప్పుకోడానికి నాకెంతో గర్వంగా ఉంటుంది. ఇది కూడ నేను చెప్పుకోకూడదని చాలా మంది నా మీద కినుక వహించవచ్చు. కాని నేనిది మానలేను. మా తండ్రి గారు తహసీల్దారుచేసి రిటైరయ్యారు. మా అన్న కలక్టరు. మా తమ్ముడు సెంట్రల్ గవర్నమెంటు లేబర్ డిపార్ట్‌మెంటులో అండర్ సెక్రటరీగా ఉంటున్నాడు. నేను మా ఇంటికి ఒక్కతెనే ఆడపిల్లను. మా అమ్మ నాకు పదేళ్లప్పుడు చనిపోయింది. నేను ఎంతో గారాబంగా పెరిగాను. బియ్యే వరకు చదివాను. నాకెప్పుడూ చదువుమీద అంత దృష్టి ఉండేది కాదు. అంతవరకూ ఎలాగో ఈడ్చుకొచ్చాను. ఇంతలో మా నాన్నగారు వీరిని తీసుకొచ్చారు. నా మనసు అప్పుడు ఒక్క అందాన్ని తప్ప ఇంకేమీ చూసేది కాదు. పైపై అందం ఒక్కటే కాదు మానవుడికి కావలసింది అని ఆనాడు గ్రహించలేక పోయాను. వారినిచూడగానే నా మనసు ఉప్పొంగిపోయింది.ఆ అందం ముందు నేను తలవంచాను. ఆ సౌందర్యం నన్ను పదేపదే తన కౌగిటిలోకి ఈడ్చుకపోతోంది. మానాన్నగారు వారి డబ్బు చూసి వారిని మెచ్చుకున్నారు. వారి సుందర స్వరూపాన్ని చూసి నేను నాలో నిలుపుకున్నాను. ఈ సంబంధం అప్పుడు మా అన్నగారికి గాని, మా తమ్ముడికిగాని సుతరామూ నచ్చలేదు. వారెందువల్ల ఈ సంబంధాని కంత సమ్మతించడం లేదో నాకా రోజుల్లో అంత అర్థమయింది కాదు. నా మనసుమాత్రం వారి వద్దకు పూలపల్లకీలో ఎక్కి క్షణక్షణమూ తరలి పోయేది. దాన్ని ప్రేమ అనండి; సౌందర్య పిపాస అనండి; మరేమనండి... నేను అదేమిటో పిచ్చిదానిలా అయిపోయాను. నా రెక్క పుచ్చుకొని తనతో తీసుకొని వెళ్ళిపోతూన్నట్లనిపించింది. ఆ ఒక్క రోజునే ఉండి, మరునాడుదయమే ఆయన వెళ్ళిపోయారు. ఆ 'రోజు' నా జన్మలో నేను మరచి పోలేను. ఆ రాత్రి నా ఎదలో నేను ఎంత ఆరాట పడిపోయానో ఎట్లా

చెప్పగలను? నా కాళ్ళు వారు పడుకున్న గది వద్దకు అనేక సార్లు పరుగు పరుగున పారిపోవ ప్రయత్నించాయి. వారి కళ్ళు నన్ను తమలోకి ఇముడ్చుకొని, నన్ను చప్పరించి వేస్తూన్నట్లయిపోయాను. నేను పడుకున్న గది తలుపులు బ్రద్దలై వారు నా ముందు అకస్మాత్తుగా ప్రత్యక్షమై నన్ను తన దీర్ఘ హస్తాలలో బిగుతుగా బంధించి వేస్తున్నట్లు ఊపిరి సలపని విరహంతో ఉక్కిరిబిక్కిరి అయిపోయాను. నా గది తలుపు గడియ వేయకుండా, నేను ఏ రోజునా నిద్రపోలేదు. కాని.... కాని... ఆరోజున మాత్రం తలుపు బంధించలేక పోయాను. నన్ను ఆయన ఏ క్షణంలోనైన తనకు బందీగా చేసుకుంటారని నా మనసు ఏమిటో పరిపరి విధాల ఊహించింది. వారికి ఆ రాత్రికి నిద్రపడుతుందా అన్న ఊహ తలలో మెదిలింది. అయ్యో... వారికి పక్కసరిగా అమరిందో లేదో... నామనసు తబ్బిబ్బయింది. ఆ గదిలో పాలు పెట్టడం మరచిపోయారేమో.... నామనసు కలగుండుపడింది. ఆ గదిలో రేడియో పెట్టవలసింది, పాపం వారికి కాస్సేపయినా కాలక్షేపమయ్యేది. పోనీ... తను ఈ గదిలో రికార్డులు వేస్తే... ఎలా ఉంటుంది? అరే... ఇదేమిటి... నాకు మతిపోయింది. వారికి నిద్రాభంగం కాదూ... కాని నాకిప్పుడు పాడటం వస్తే ఎంత బాగుండును.... ఇలాగే ఇలాగే ఏమిటేమిటో ఆలోచించాను. నన్ను నేను మరచి ఏమిటేమిటో అయిపోయాను. ఆనాటి నా ఊహలకు ఓ దారీ తెన్నూ లేదు.

వారికిప్పుడు నిద్రపడుతోందా... నాగురించి ఏమని ఆలోచిస్తున్నారో... ఇంతకీ నేను నచ్చానో లేదో. నచ్చకపోవడమేమిటి నా మొహం... నన్ను చూడగానే అలా నిర్ఘాంతపోయారు. ఎప్పుడూ ఇలాంటి స్త్రీని చూడలేదన్నట్లుగా ఆ కళ్ళల్లో తమకం ద్యోతకమయింది. కాని..... కాని... ఆ తరువాత ఎలా నవ్వారు.... ఆ పలువరుస ఎంత హాయిగా ఉంది. ఆ చూపులు నన్ను స్వర్గలోకంలోకి తీసుకొని పోయాయి.

కాని ఆయన; అన్నగారితోగాని నాన్నగారితోగాని ఒక్కమాట మాట్లాడలేదు. మూగ మనిషి కాదు కదా... పాపం నన్ను చూడగానే కంఠం స్తంభించి పోయిందేమో..... అదేమిటోగాని, ఆయన్ని కొంటెగా ఏడిపించా లనిపిస్తోంది. ఆ కిటికీ దగ్గరకు వెళ్ళి ఈ గులాబిపూవు ఆయన మీదికి విసిరితే... ఏమనుకుంటారో... ఛీఛీ ఇవేమి బుద్ధులు... సంస్కారం అంటే ఇదేనా... నేనెంత తప్పుగా ఊహిస్తున్నాను.... కాని... కాని.... ఏమిటీమాయ! ఈ ఊహలు తనను విడిచిపోవేమి? ఇన్నాళ్ళూ అకస్మాత్తుగా ఇన్ని సౌరభాల నెలా వెదజల్లుతున్నాయి. ఏమిటో నా కేమీ అర్థం కావడంలేదు. కాని నాకు వారు అర్థమౌతున్నారు. ఈ రాత్రి వారికి నేను తప్పక కలలో కనుపిస్తాను.

అప్పుడు వారు నన్ను పట్టుకోబోతారు. నేను పరుగు పరుగున పారిపోతాను. నాతో ఈ చిన్న దానితో వారు పరుగు పెట్టగలరా ఏం.... నేను లేడిపిల్లలా పారిపోనూ..... ఈ తోటంతా తిప్పుతాను. వారు పూర్తిగా అలసిపోయేట్లు చేస్తాను. అబ్బ! ఇదేమిటి... నాకు మతిపోతోంది. లేకపోతే ఈ రకంగా ఎవరాలోచిస్తారు. ఔను కాని... కాని.. ఆ పెదవులెంత అందంగా ఉన్నాయి! గులాబులు అలా ఎందుకు పుట్టలేదనీ ఏడుస్తున్నాయి కదూ... ఆ వక్షస్థలం ఎంత స్థిరంగా ఉంది! అందం అంటే అలాగే ఉండాలి. నిజంగా నేను ఎంత అదృష్టవంతురాలిని!

వారు నాకోసం పుట్టారు. నేను వారికోసం పుట్టాను. ఎంత బాగుంది ఈ ఊహ! కాని .... అరే ఇదేమిటి తలుపు దగ్గర ఏదో చప్పుడయింది. ఏమిటీ... నిజంగానా... అమ్మో.. ఇది పెద్దమనిషి వ్యవహారమేనా... ఇట్లా వంటరిదాన్ని చేసి... ఇలా బరితెగిస్తారా.... ఇంత దుర్బుద్ధి ఎలా వచ్చింది. ఉహూ... ఏమీ బాగులేదు. నన్ను ప్రేమిస్తే మాత్రం... తలుపు గబాలున వేసేస్తాను. అరే కాళ్ళు కదలడం లేదేమిటి... నాకేం తెలివి తప్పడం లేదు కదా.... అమ్మయ్యో! నన్ను భయం ఆవహిస్తోంది. నా గుండెల్లో ఏమిటీ దడ? మీకు పుణ్యముంటుంది... ఈ ఒక్క రాత్రికీ కరుణించండి. వద్దు... వద్దు... ఆ తలుపు తోసుకొని రావద్దు. అయ్యో... నా మాటలు చెవిని సోకడం లేదా... ఏమిటా వేగం... ఏమిటా నడకలోని ఆతృత... ఆ కనులలో విరహంతో ఊగిపోతున్న నల్లని తలకట్టు సౌందర్యశోభ... ఆపెదవులలో పట్టరాని తమకం... ఆచేతులలో ఆ సంచలనం, ఏమిటీ వింత ప్రకృతి. ఇదేమిటి ఈ గుండెల్లో జ్వలించే నెత్తురు కణాల ఉద్వేగపు పొంగు, నేను భరించలేను. అబ్బ! వెన్నెల్ని ముద్దుల పిడికిటిలో నలిపివేసే ఈక్షణం... గాలిని విరహంతో చీల్చివేసే ఈ తరుణం, సౌందర్యం తలమీద రెక్కతురాయి, ఆనందం అంతరాత్మలో అదేదో హాయి, ఒహో ఏమిటీ, ఏమిటీ నేను తలస్తున్నాను. మునిగిపోతున్న ఈ ఆలోచనలనదిలో అడుగు కాలికి తగలదేమిటి? ఇందులోంచి పైకి తేలడమెలాగా తోచదేమిటి? అయ్యో ఇదంతా నా భ్రమేనా, నిజంగా వారు రానేలేదా... ఏమిటీ చోద్యం, ఏమిటి నాలోన ఈ జ్వాల. ఎందుకు నా హృదంతరాళంలో ఈ మోహన లీల. ఇదంతా గాలిచేసిన దగాయేనా. ఈ తలుపు సవ్వడి నిజమయింది కాదా. కాని నిజంగా వారు ఎంత నీతి కలవారు. కాని. వారు ఉంటే ఎంత మనోజ్ఞంగా ఉండేది! ఏమిటీ కోరిక, ఒక్కసారి ఆ ముఖంలోకి చూడాలని ఏమిటీ వింత ఆవేదన!

ఏమిటో ఆవేదన! కోరికల కాటుకపెట్టుకొని, విరహాన్ని వలిపంగా తలపైకిలాగుకొని

ఎడదసవ్వడులే గజ్జెల రవళిగా ఎచ్చటికీ ప్రయాణం?

వారు ఆమరునాడే వెళ్ళిపోయారు. నేను అలాగే చూస్తూ ఉండిపోయాను. తిరిగి ఎన్ని యుగాలకో వారిని దర్శించడం. అప్పుడే మా తమ్ముడు నా దగ్గరకు వచ్చాడు. వింతగా నవ్వాడు. ఎలాగున్నాడక్కా... అన్నాడు. ఏమి చెప్పగలను వాడికి? తన అందాన్ని నా దోసిటలోపోసి, నా అసువులను తన సుదీర్ఘ హస్తాలలో ఇరికించుకొని వెళ్ళి పోయిన ఆ ప్రాణ వల్లభుని ఏమివర్ణించగలను? చెప్పడానికి పెదవులలో చలనం ఎక్కడుంది?

కాని, వాడు గట్టిగా నవ్వాడు, ' ఏం మనిషక్కా..... నాకేం నచ్చలేదు. నీకు ఎలా నచ్చాడో కాని....' అన్నాడు. నాకు నచ్చినట్లు వాడికెలా తెలిసిందో మరి! నేను వాడివైపు రెప్పవాల్చక చూశాను, ఏమిటి నీ ఉద్దేశం అన్నట్లు.

వాడు ఒక్కసారిగా ఎంతో చులకనగా 'చుట్టకాలుస్తాడక్కా' అన్నాడు. ఈ మాట వినగానే నా కెందుకో నవ్వు వచ్చింది. అంతే.........

మా పెళ్ళి ఎన్నాళ్ళో ఎడబాటు లేకుండానే అయిపోయింది. పెళ్ళిలో వారు నా కంఠానికి ఉరిపోసినట్లు మంగళసూత్రం బిగించారు. తలంబ్రాలు నా కళ్ళళ్ళో పోశారు. ఇంకా, ఇంకా ఇలాంటి వెన్నో అవకతవకగా ఆచరించారు. అయినా నేను సహించాను. అలాగే ఆ ముహూర్తం కూడ సమీపించింది. సమస్తమూ ఉజ్వలంగా జ్వలించిపోతోంది. నా మనసు వజ్రాల హారంలా వెలిగిపోతోంది. నా పెదవులు, నా ఎదలోని అలల అమృత చలనాన్ని క్షణ క్షణమూ ప్రదర్శిస్తున్నాయి. నాలో ఎనలేని మహోత్సాహం నిండి, నన్ను ఠీవిగా, కొంటెగా నిలబెట్టాయి.

కాని, కాని వారు నన్ను ఎవరుగా భావించారు? నాలోని సంస్కారాన్ని ఎంతవరకు ఆఘ్రాణించారు? అయ్యో, ఇట్టి అవమానంఏ స్త్రీ భరించగలదు? వయొలిన్ వాద్యం ప్రక్క మొరటు కంఠాన్ని ఎట్లా వినగలం? మంగళ సూత్రానికి తాళాలు కట్టే స్త్రీని ఎట్లా వీక్షించగలం? అంత మొరటుగా, అంత వికారంగా ఆయన, ఆ సమయాన .....ఎలా చెప్పగలను?

ఒక్క మాట లేదు, ఒక్క పలుకు లేదు. ఎవరో ముక్కూ మొగం ఎరుగని పరాయి స్త్రీని బలత్కరించినట్లు వారు నాపైబడి, నా చీరను లాగి వేశారు.

నాలో చీకట్లునిండి, నన్ను పాతాళానికి త్రొక్కివేశాయి. ఇక నాలో ఏముంది? ఇక నేనేమి చెప్పను? సంస్కారంలేని సౌందర్యాన్ని గురించి ఇహ ఏమి చెప్పను?

ఆ రోజునే నా కళ్ళల్లోని సౌందర్య పిపాస తగలబడిపోయింది.

(విశ్వవీణ, విశాఖపట్నం 1-11-1959)